క్లుప్తంగా

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాఖ విద్య: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఎస్‌టీఎస్‌వో ఒలింపియాడ్ ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారని స్కూల్ డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 10వ తరగతి వరకు ఆలిండియా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విశాఖ జోన్ పరిధిలో 8 మంది శ్రీచైతన్య విద్యార్థులు ల్యాప్‌ట్యాప్‌లను సొంతం చేసుకున్నారన్నారు. మరో 41 మంది ట్యాబ్‌లను పొందారన్నారు. 198 మంది విద్యార్థులు టాప్ 5 ర్యాంకులను, 3,895 మంది మెడల్స్ కైవసం చేసుకున్నారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆమె అభినందించారు.

ఎంజీఎం హైస్కూల్ ఆకస్మిక తనిఖీ



ఎంజీఎం హైస్కూల్లో తనిఖీలు చేస్తున్న అల్లావుద్దీన్

అల్లిపురం: డాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌ను సోమవారం డైట్ కళాశాల ప్రతినిధి అల్లావుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వివిధ తరగతులను, వివిధ అంశాల ప్రాతిపదికగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరచుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో పరిశుభ్రత, ఉపాధ్యాయుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం



రోగి బంధువులకు ఆర్థికసాయం చేస్తున్న దాతలు

డాబాగార్డెన్స్: సీతమ్మధార లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు పొందుతున్న జాలారిపేటకు చెందిన వి.దేవికకు ఆసుపత్రి ట్రస్టీ వెలగపూడి ఉమామహేశ్వరరావు సమక్షంలో లయన్ బీఎస్ మాణిక్యం తన సొంత నిధుల నుంచి రూ.10 వేలు, లయన్స్ నార్త్ ట్రస్ట్ తరఫున కార్యదర్శి బి. కృష్ణారావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దాతలకు దేవిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కౌమార బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు

అల్లిపురం: పౌష్టికాహార లోపం కారణంగా కౌమార బాలికలు రక్తహీనతతో బాధపడుతున్న నేపథ్యంలో వారికి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో బాలికలకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీలావణ్య, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు సంయుక్తంగా విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. అదే విధంగా చిరుధాన్యాలు, కాయగూరలు, ఆకుకూరలు అధికంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు శ్రీవల్లి, ఎస్.నాగేశ్వర్, ఎం.భారతి, నాగమణి, ఎం.అరుణ, టి.సనోజిని, ఆశ వర్కర్ బి.లీలావతి, మహిళా పోలీస్ జి.హారిక, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సంతర్పణ

సీతమ్మధార : ప్రముఖ చిత్ర కథానాయకుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు సోమవారం సంగం, శరత్ థియేటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంగం, శరత్ థియేటర్ అధినేత శరత్‌కుమార్‌రెడ్డి, కాంతి పిక్చర్స్ అధినేత ఎన్ఆర్‌కే రెడ్డి, మేనేజర్లు ప్రసాద్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

విజయం.. తథ్యం

- పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా బోధన
- రోజూ ఉదయం, సాయంత్రం ప్రిపరేషన్
- ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులకు ఉపాధ్యాయుల దిశా నిర్దేశం



విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయురాలు

అల్లిపురం: పదిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు దృఢ సంకల్పంతో ఉన్నారు. ఏప్రిల్ 3 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే సిలబస్ పూర్తి చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించేలా విద్యార్థులచే ప్రాక్టీస్ చేయిస్తున్నారు. అదే విధంగా చేతి రాత కూడా పరీక్షల్లో ముఖ్యం కాబట్టి ఆ అంశంలోనూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఇలా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠాలపై పూర్తి స్థాయి పట్టు సాధించేలా శిక్షణ అందిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అంతిమంగా ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా పని చేస్తున్నారు.

ఉత్తీర్ణతా శాతం పెంచేలా కార్యాచరణ..

ప్రతి రోజు ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం వరకు రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం సుమారు 45 నిమిషాలు రోజుకి ఒక సబ్జెక్టుపై దృష్టి పెడుతున్నారు. రోజువారీ పరీక్షలు చేపడుతూ, విద్యార్థుల అనుమానాలు నివృత్తి చేస్తూ పరీక్షలకు వారిని సన్నద్ధం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన పరీక్షల్లో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఒత్తిడిని అధిగమించేలా..

పదవ తరగతి పరీక్షలంటే విద్యార్థుల్లో ఎంతో కొంత ఆందోళన, ఒత్తిడి ఉంటుంది. దాని నుంచి ఉపశమనం పొందేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. వారు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసేలా ప్రతిరోజు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. తల్లిదండ్రులతో మాట్లాడి ఇంటి వద్ద పిల్లలకు ఒత్తిడి లేకుండా చూడాలని సూచిస్తున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం



పది పరీక్షలకు విద్యార్థులను అన్ని విధాల సిద్ధం చేస్తున్నాం. ఉపాధ్యాయులంతా సమష్టిగా పని చేస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించేలా పర్యవేక్షిస్తున్నాం. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించాం. ఈసారి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– ఆర్.వి.వి.ఎస్.నాగభూషణం, ప్రధానోపాధ్యాయుడు, ఎంజీఎం హైస్కూల్

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



క్లాసులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. అన్ని సబ్జెక్టుల్లో వారు పుంజుకునేలా అవగాహన కలిగిస్తున్నాం. డీఈవో ఆదేశాల మేరకు 40 రోజుల కార్యాచరణ పక్కాగా అమలు చేస్తున్నాం.

– వి.శివజ్యోతి, మ్యాథ్స్ ఇన్‌చార్జి, ఎంజీఎం హైస్కూల్

స్టడీ అవర్స్‌తో చాలా ప్రయోజనం



ప్రతిరోజు స్కూల్లో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ కార్యక్రమం మాకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. ఆ సమయంలో శ్రద్ధగా చదువుతున్నాం. మా సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాము. దీంతో పాఠ్యాంశాలపై పూర్తిగా అవగాహన ఏర్పడుతోంది.

– అశోక్, తెలుగు మీడియం విద్యార్థి

ప్రణాళికతో చదువుతున్నాం



ఉపాధ్యాయులు చెప్పినట్లు పక్కా ప్రణాళికతో చదువుతున్నాం. అలా చదవడం వల్ల ఒత్తిడి అనిపించడం లేదు. మంచి మార్కులు సాధిస్తామని మాపై మాకు నమ్మకం వచ్చింది. ఉపాధ్యాయులు చక్కని సూచనలు చేస్తున్నారు.

–స్వేతా పాత్రో, ఇంగ్లీష్ మీడియం విద్యార్థిని

సీతంరాజు పెద్ద మనసు



రామజోగిపేట బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న సీతంరాజు సుధాకర్

మహారాణిపేట : రామజోగిపేటలో ఇటీవల భవనం కూలిన ఘటనలో చనిపోయిన వారికి, క్షతగ్రాతులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ ఆర్థిక సహాయం అందించారు. సోమవారం కేజీహెచ్‌లో ఉన్న వారికి తన సొంత నిధుల నుంచి అయిదుగురికి రూ.50 వేల రూపాయలు అందించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, చనిపోయిన వారికి వైఎస్సార్ బీమా కల్పించాలని ఆయన కోరారు. ఎలాంటి సహాయం కావాలన్నా తాను సిద్ధంగా ఉన్నానని భరోసా కల్పించారు. కార్పొరేటర్లు ఉరికిటి నారాయణ, చెన్నా జానకీరామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుకొండ సూర్యప్రసాద్, వినయ్, సతీష్, కేజీహెచ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేయాల్సి ఉంటుంది.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు



విద్యార్థులతో డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ తదితరులు

అల్లిపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అందుకుంటారని డిప్యూటీ డీఈవో ఎ. గౌరీశంకర్ అన్నారు. అల్లిపురం వైర్లెస్ కాలనీలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అర్ధ శతాబ్దం క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఉదయం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన, ఆరోగ్యం, తగిన నిద్ర, పౌష్టికాహారం, ఏకాగ్రతతో కూడిన విద్యాభ్యాసం వల్ల వార్షిక పరీక్షల్లోనే కాక జీవితంలో ఎదురయ్యే ప్రతి పరీక్షలో ఉత్తీర్ణులవుతారని ఆయన అభిప్రాయపడ్డారు. పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నిమిత్తం దిశా నిర్దేశం చేశారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాలతో ఉన్న అనుబంధం, వాళ్ళ ప్రోత్సాహక కార్యక్రమాలను అభినందించారు. అనంతరం పరీక్ష అట్టలు, జామెట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు ఉచితంగా అందజేశారు. డైట్ కళాశాల (భీమిలీ) రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ డబ్బీరు రమామణి మాట్లాడుతూ తన తల్లి డబ్బీరు సుగుణ జ్ఞాపకార్థం ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు బాలికలకు రూ.5 వేలు చొప్పున ఉపకార వేతనం అందజేయనున్నట్లు ప్రకటించారు. బాలురకు కూడా మంచి ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.లక్ష్మణరావు, పూర్వ విద్యార్థులు దత్తి ప్రసాదరావు, బూరె రమేష్, పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఆర్. ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీకి అన్యాయం చేస్తున్న కేంద్రం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార : పోలవరం ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్‌కి బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ఆరోపించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట ప్రతిపాదించిన ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లను కాదని నేడు ఎత్తు తగ్గించేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి చేయాలని, నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఎస్.కె.రెహ్మాన్, పి.చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఔదార్యం



మృతురాలు చుక్కా బాలకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఔదార్యం చాటుకున్నారు. జీవీఎంసీ 33వ వార్డు కొల్లివారి వీధిలో నివసించే చుక్కా సింహాచలం కుమార్తె చుక్కా బాల (30) గత ముప్పై సంవత్సరాలుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సోమవారం ఆమె మరణించడంతో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపి ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి మృతురాలి ఇంటికి వచ్చారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దహన ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు సొంత నిధుల నుంచి ఆర్థిక సహకారం అందించారు. మృతురాలి కుమారుడి స్కూల్ ఫీజుకు కూడా ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, సీనియర్ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, బొర్రా శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంతం, జ్యోతి, లండా రమణ, బొగ్గు శ్యామ్, బోణి దేవా, సుబ్రహ్మణ్యం, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

'దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చడం తగదు'

మహారాణిపేట : బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చడం రాజ్యాంగ విరుద్ధమని జిల్లా అధ్యక్షుడు కోడూరి సంజీవరావు అన్నారు. మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి మంచా నాగమల్లీశ్వరి మాట్లాడుతూ ఎస్సీలకు రుణాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. నాయకులు కట్ట పద్మకళ్యాణి, జామి శ్రీనివాసరావు, రేఖ కరుణారావు, కావూరి మధుసూదనరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మరింత మెరుగ్గా పారిశుధ్యం



రహదారులను శుభ్రం చేయిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: పారిశుధ్యం పట్ల మరింత శ్రద్ధ కనబరచాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. సోమవారం ఫుడ్‌కోర్టు, జ్ఞానాపురం, పాత పోస్టాఫీసు ప్రాంతాల్లో దగ్గరుండి పారిశుధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి జి–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రహదారుల్లో ఎక్కడా చెత్తకుప్పలు ఉండకూడదన్నారు. అలాగే డస్ట్‌బిన్లలో చెత్తను ఉదయాన్నే వాహనాల ద్వారా యార్డుకు తరలించాలన్నారు. డివైడర్ల మధ్యనున్న మొక్కల పరిరక్షణ బాధ్యత హార్టీకల్చర్ అధికారులే చూసుకోవాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఫ్లైఓవర్, రైల్వేస్టేషన్ రహదారి, సిరిపురం, బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి పరిసరాలు పరిశుభ్రం చేయాలన్నారు. వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, సెక్రటరీలు అందుబాటులో ఉండాలన్నారు.

పారదర్శకంగా వేలం పాట నిర్వహించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: కాంట్రాక్టర్లు, వ్యాపారులకు ఇబ్బంది లేకుండా ఆశీలు పాట నిర్వహించాలని సోమవారం 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు జోన్–4 కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ బహిరంగ వేలం పాటలో గెజిట్ నిబంధనల ప్రకారం వసూలు చేయాలన్నారు. అలా చేయాలంటే జీవీఎంసీ ఆశీలు పాట తగ్గించి నిర్వహించాలన్నారు. గెజిట్‌లో రూ. 2 నుంచి మొదలుకుని రూ. 10, రూ. 20 వరకు వసూలు చేయాలని ఉందన్నారు. ఇలా వసూలు చేస్తే సంవత్సరానికి జీఎస్‌టీతో కలుపుకుని రూ. 60 లక్షలకు మించి రాదన్నారు. కానీ జీవీఎంసీ ఆశీలు పాట జీఎస్‌టీతో కలుపుకుని రూ. కోటి నిర్వహిస్తుందన్నారు. దీని వలన పాట పాడుకున్న కాంట్రాక్టర్లు మధ్యలో వదిలేసి నష్టపోతున్నారన్నారు. ధరలు పెరుగుపోతున్న నేపథ్యంలో పూర్ణామార్కెట్ ఇంకా పాత గెజిట్ ఆధారంగానే పాట నిర్వహిస్తుందన్నారు. అధికారులు పూర్ణామార్కెట్ ఆశీలు పాట విషయమై పునరాలోచన చేసి ఆశీలు పాట నిర్వహించాలని విల్లూరి కోరారు.

కొబ్బరితోటలో అగ్నిప్రమాదం

- గ్యాస్ లీకేజీయే కారణం
- ఫైర్ సిబ్బంది రాకతో తప్పిన ముప్పు
- ఒకరికి అస్వస్థత



ప్రమాదం నుంచి బయటపడ్డ బాధితులతో ఫైర్ సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోటలో సోమవారం రాత్రి ఒక ఇంట్లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సకాలంలో ఫైర్ సిబ్బంది, స్థానికులు చేరుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఏడీఎఫ్‌వో ఆర్.రమణ, స్థానికులు, బాధితుల కథనం ప్రకారం కొబ్బరితోట ఆర్చి వద్ద పితాని గురుమూర్తి తన కుటుంబంతో కలసి జీవిస్తున్నారు. రాత్రి 7.30 గంటల సమయంలో బేబి శిరీష వంట చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగాయి. దీంతో వారు హాహాకారాలు చేయటంతో స్థానికులు స్పందించి వారిని బయటికి తీసుకువచ్చారు. ఈలోగా సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. మండుతున్న గ్యాస్ సిలిండర్‌ను ఆరుబయటికి తీసుకువచ్చి మంటలను అదుపు చేశారు. మంటల కారణంగా ఇంట్లో పొగ అలుముకోవడంతో బేబీ శిరీష అస్వస్థతకు గురి కాగా ఆమెను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ఇంట్లో గురుమూర్తి, బేబీ శిరీషతో పాటు అరుణ్‌కుమార్, బాలయశ్వంత్ (9), వర్షిక (5), అరుణ (28), మనస్వి (9 నెలలు) బేబి ఉన్నారు. ఎటువంటి ప్రాణాపాయం లేకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావుతో పాటు సూర్యాబాగ్ ఫైర్ స్టేషన్ ఏబీఎఫ్‌వో ఆర్.రమణతో కలసి లీడింగ్ ఫైర్‌మెన్ సీహెచ్ శ్రీనివాసకుమార్, డ్రైవర్ ఆపరేటర్ రవికుమార్, ఫైర్‌మెన్ సీహెచ్ కాసుబాబు, కె.పైడిరాజు, ఎస్.రాజు, ఎ.శివకృష్ణ మంటలను అదుపుచేసి క్షతగాత్రులను సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు ఎగసిపడినప్పుడు ఏ విధంగా అదుపు చేయాలో స్థానికులకు ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



గర్భిణులకు డ్రైఫ్రూట్స్ అందజేస్తున్న వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి బిషప్ కాయిత మరియదాస్ కమ్యూనిటీ హాల్లో సోమవారం యునైటెడ్ వే ముంబాయి, ఆది హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ బి.కిరణ్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ప్రగతి మిత్ర సహకారంతో సెబాస్టియన్, బాబుకాలనీ అంగన్‌వాడీ కేంద్రాల గర్భిణులకు ఉచిత పౌష్టికాహారం (డ్రై ఫ్రూట్స్) కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు వేశంగిణీరావు, దేవి, ఈశ్వరి, ఆనంద్, చరణ్, బాబ్జీ, కమల్‌కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సన్‌గ్రీన్ సంస్థ సీఈవో శృతి, సురేష్

డాబాగార్డెన్స్: నిరంతరం సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని సన్‌గ్రీన్ సీఈవో శృతి పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో శ్రీసూర్య ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కమిటీ సీఇవో సురేష్ మాట్లాడుతూ సన్‌గ్రీన్ సంస్థ నిరంతరం సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. శృతన తన తండ్రి పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సన్‌గ్రీన్ సీఈవో శృతి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో తన తండ్రిని కోల్పోయానని తెలిపారు. తండ్రి పేరిట సూర్య ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 30న వేపగుంటలో గల జై సంతోషిమాత ఆలయంలో సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బాపిరాజు, ప్రధాన అర్చకుడు విశ్వేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

బీవీపీ రాష్ట్ర సంస్కార్ ప్రముఖ్‌గా రాజశేఖర్



ఎంవీ రాజశేఖర్

డాబాగార్డెన్స్: భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర సంస్కార్ ప్రముఖ్‌గా ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ నియమితులయ్యారు. విశాఖపట్నం ప్రాంత్ అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు, కార్యదర్శి జీఎస్వీ సుబ్రహ్మణ్యంతో పాటు బీవీపీ వివిధ శాఖలకు సంబంధించిన ప్రతినిధులను ఎన్నుకున్నారు. 2023 నుంచి 2025 వరకు ఈ పదవిలో కొనసాగుతారు. భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం ప్రాంత్, వివిధ జిల్లాలకు సంబంధించిన శాఖలు దేశభక్తితో విద్యార్థుల కోసం నిర్వహించే విభిన్న సేవా కార్యక్రమాలకు రాజశేఖర్ ప్రాతినిధ్యం వహిస్తారు. బీవీపీ విశాఖ శాఖ అధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు, జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్‌చంద్‌జైన్, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎస్‌వీవీ సత్యనారాయణ అభినందనలు తెలిపారు. వచ్చే నెల 5వ తేదీన ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో నిర్వహించే బీవీపీ ప్రాంత్, వివిధ శాఖల ప్రమాణ స్వీకారోత్సవంలో రాజశేఖర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన యువత



పార్టీలో చేరిన యువతతో నాయకులు

డాబాగార్డెన్స్: కాంగ్రెస్ పార్టీతోనే దేశ భవిష్యత్ ముడిపడి ఉందని ఆ పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం విశాఖ జిల్లాలో గల వివిధ పార్టీల నుంచి 110 మంది యువత కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో గొంప మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడంపై ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన యువతకు కాంగ్రెస్ కండువా వేశారు. కార్యక్రమంలో పార్టీ నగర ఉపాధ్యక్షురాలు లక్ష్మి, అనకాపల్లి జిల్లా బాధ్యుడు రుత్తల శ్రీరామ్ మూర్తి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, నగర బీసీ సెల్ చైర్మన్ కె. చినబాబు, పార్టీ నాయకుడు పరదేశి పాల్గొన్నారు.